క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ధర్మసాగర్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ ధర్మసాగర్ ఏఈ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా ఉనికిచర్ల, చిన్నపెండ్యాల 11 కేవీ ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, అలాగే క్యాతంపల్లి, పెద్ద పెండ్యాల 11 కేవీ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేలేరు : మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో 33 కేవీలో అత్యవసర మరమ్మతులు చేపట్టను న్నందున పీచర, వేలేరు గ్రామాల సబ్‌స్టేషన్ల పరిధిలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు అన్ని 11 కేవీ ఫీడర్ లైన్‌ల త్రీఫేజ్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కుమారస్వామి ఆదివారం తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

అంబేడ్కర్ భవనం మంజూరు చేయాలి



శాయంపేట : మండల కేంద్రంలోని రైతు వేదిక పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో అంబేడ్కర్ భవనం మంజూరు చేయాలని దళిత, బహుజన, వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో దళిత బహుజన సంఘాల నాయకులు మొగ్గం సుమన్, మారెపల్లి క్రాంతికుమార్, అంకేశ్వరపు ఐలయ్య, నాగుల పవన్‌కళ్యాణ్, మంద సురేష్, నాలికె ప్రతాప్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం లోని శ్రీ సీతారామచంద్ర స్వామిని ఆదివారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా స్వామివారి కల్యాణమహోత్సవం, బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లపై గ్రామ పెద్దలతో చర్చించారు. గ్రామస్తులంతా ఐకమత్యంతో కలిసి స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతు సుమలతరమణారెడ్డి, నాయకులు కర్రు ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి సమావేశాన్ని విజయవంతం చేయాలి

శాయంపేట : పరకాలలోని జీఎంఆర్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించనున్న ఎన్నికల సన్నాహక సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్ గెలుపు కోసం కార్యకర్తలు చేయాల్సిన కర్తవ్యాలను వివరిస్తారని పేర్కొన్నారు.

నిరసన దీక్షకు సంఘీభావం



ఎల్కతుర్తి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లుగా తెలంగాణ రాష్ట్రానికి చేసిన అన్యాయంపై, వైఫల్యాలను ఎండగడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కరీంనగర్‌లో చేపట్టిన నిరసన దీక్షకు యువజన కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపం వద్ద ఏర్పాటు చేసిన నిరసన దీక్షలో నాయకులు పాల్గొన్నారు. దీక్షలో ఎర్రోళ్ల చైతన్య, బత్తిని శ్రావణ్, పెండ్యాల తిరుపతి, శనిగరం వెంకటేష్, శ్రీధర్ రావు, ముప్పు శ్రీనివాస్, రావుల రమేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలి

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని శాయంపేట, పరకాల, ఎల్కతుర్తి, ధర్మసాగర్, కమలాపూర్, నడికూడ, ఐనవోలు, వేలేరు, ఆత్మకూరు, దామెర మండల కేంద్రాల్లో, మండలంలోని ఆయా గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో అంబేడ్కర్ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు ఎలా అందాలో గొప్ప దిశా నిర్దేశం చేసిన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన రూపొందించిన రాజ్యాంగం ద్వారానే ఈ రోజు రిజర్వేషన్లు పొందుతున్నామన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, ఎమ్మార్పీ ఎస్, ఎంఎస్పీ నాయకులు, ఆయా పార్టీల నాయకులు, జైభీం ప్రతినిధులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



కమలాపూర్ : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ధర్మసాగర్: మాట్లాడుతున్న గంగారపు శ్రీనివాస్



శాయంపేట : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



ఎల్కతుర్తి : ముల్కనూర్‌లో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సుధీర్‌కుమార్



ఆత్మకూరు : అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



పరకాల : అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా



నడికూడ : అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్



పరకాల: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రేవూరి



ఎల్కతుర్తి : పండ్లు పంపిణీ చేస్తున్న రవీందర్



దామెర : కేక్ కట్ చేస్తున్న బిల్లా రమణారెడ్డి



ఐనవోలు : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు, ఎంపీపీ మధుమతి



వేలేరులో...

వాహనాలు వేగంగా నడపడం ప్రమాదకరం

ధర్మసాగర్: వాహనాలు అతివేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారకులవుతున్నారని కాజీపేట ఏసీపీ పి.తిరుమల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాజీపేట డివిజన్ పరిధిలోని ధర్మసాగర్, కాజీపేట, మడికొండ, హసన్‌పర్తి, కమలాపూర్, ఎల్కతుర్తి, ముల్కనూర్, వంగర, వేలేరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కొంతమంది వాహనదారులు రోడ్డుపై రేసింగ్ పెట్టుకొని ఇతరులకు అసౌకర్యం కలిగిస్తున్నారని అన్నారు. రాయల్ ఇన్ఫీల్డ్, ఇతర ద్విచక్ర వాహనదారులు బైక్ సైలెన్సర్, హారన్లు మార్చుతూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. తల్లిదండ్రులు తమ మైనర్లకు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు ఇస్తున్నారన్నారు. ఎవరైనా వాహనాలు ఇస్తే వారిపై మోటార్ వాహన చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకొని వాహనాన్ని సీజ్ చేసి కోర్టుకు తరలిస్తామని తెలిపారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

మడికొండ: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం శ్రీరామ మూల మంత్ర హోమం, ధ్వజరోహణ, అగ్నిప్రతిష్ఠాపన, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పం జరిపించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వాహణాధికారి కే.శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు పరాశరం విష్ణువర్ధనచార్యులు, రాగిచేడు అభిలాష్‌శర్మ, పారుపల్లి సత్యనారాయణ శర్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఖిలా వరంగల్: మత్స్య కార్మికులకు సహాయ సహకారాలు అందజేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ అన్నారు. పడమర కోటలోని ముదిరాజ్ భవనంలో ప్రాథమిక మత్స్యకార మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు బోళ్ల భిక్షపతి, రావుల రాజేష్, బోళ్ల కుమారస్వామి, ముదిరాజ్ ట్రస్టు ప్రతినిధిలు బోళ్ల సారంగపాణి, గీకురు సారంగపాణి ఆధ్వర్యంలో మత్స్యకార్మికుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా తీగల జీవన్‌గౌడ్‌ను ముదిరాజ్ ప్రతినిధులు సన్మానించారు. సమావేశంలో చంద్రశేఖర్, యాదగిరి, క్రాంతి, సునంద్‌కుమార్, పొన్నం ఆంజనేయులు, బోళ్ల నాగరాజు, కొత్తపెల్లి శ్రీనివాస్, నరసింహస్వామి, పెసరు రాజు, శివశంకర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పల్లా, రాకేశ్‌రెడ్డి



అమ్మవారిని దర్శించుకున్న జంగా రాఘవరెడ్డి

వేలేరు: మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా యంత్రస్థాపన, విగ్రహస్థాపన, దిష్టికుంభం, మహా పూర్ణహుతి, పోతురాజులతో గ్రామ పర్యటన నిర్వహించారు. కార్యక్రమాన్ని మత్తగజం సిద్ధేశ్వరానంద భారతి స్వామిజీ, మునుగులేటి వంశీశర్మ తిరుమల, తిరుపతి దేవస్థాన ఆగమ పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డీజే పాటలతో వీధుల్లో శోభాయాత్ర నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, స్టేట్ ఆయిల్ సీడ్స్, గ్రోవర్స్ చైర్మన్ రాఘవ రెడ్డి, బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వంచారు. జెడ్పీటీసీ సరిత, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సంధ్యభూపతి రాజ్, నర్సింగరావు, సద్దాంహుస్సేన్ పాల్గొన్నారు.

గుండె చికిత్సకు ఆర్థిక చేయూత



వరంగల్ చౌరస్తా: వరంగల్ ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి (ఏసీపీఎస్) ఆపద్బంధు పథకంలో భాగంగా నల్ల పద్మ గుండె చికిత్స కోసం రూ.45వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. వరంగల్ పిన్నావారి వీధిలోని ఆర్యవైశ్య సత్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గందె ప్రేమ్‌గాంధీ, చంద జగదీశ్వర్, గాదె వాసుదేవ్, చిదిరాల నాగరాజు, అరవింద్ బాబు, విడియాల నూతన్ కుమార్, గుండా రమేష్, వాసుదేవ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కడియం, అరూరి నమ్మకద్రోహులు

● మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల: కడియం శ్రీహరి, అరూరి రమేశ్ ఇద్దరు కేసీఆర్‌ను, తెలంగాణ ప్రజలను మోసం చేశారని వారిద్దరూ నమ్మక ద్రోహులని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మండిపడ్డారు. పరకాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలిచ్చిన వాగ్దానాలను విస్మరించిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పదేళ్లు అధికారాన్ని, పదవులను అనుభవించిన నాయకులు అధికారం పోగానే పార్టీ మారడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే ఎన్నికల ముందు ఆరు గ్యారంటీల పథకాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడు తాగునీటికి సమస్య రాలేదని, కానీ మూడు నెలలు కాకముందే కరువు రావడం చూస్తుంటే కాంగ్రెస్ తెచ్చిన కరువులాగానే ఉందన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడి తొలగింపు

పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నందుకు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీనును పదవి నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నిప్పాని సత్యనారాయణ, చందుపట్ల రమణారెడ్డి, దగ్గు విజేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలతో రైతులకు మేలు

● తక్కువ ఖర్చు..ప్రయోజనాలు అధికం
● పశుగ్రాస సేకరణలో చేదోడుగా పరికరాలు
● ఆసక్తి చూపుతున్న రైతాంగం



గడ్డికట్టను కట్టి నేలపైకి విడిచిపెడుతున్న యంత్రం

ఎల్కతుర్తి : పశుపోషణకు గ్రాసాన్ని నిల్వ చేయడానికి రైతులకు యంత్రాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. వరిగడ్డి కట్టలు కట్టే యంత్రాలు రావడంతో కూలీల కొరతను అధికమించి ఎక్కువ విస్తీర్ణంలో పశుగ్రాసాన్ని నిల్వ చేసుకుంటున్నారు. పశుసేకరణలో రైతులకు యంత్రాలు ఎంతో చేదోడు వాదోడుగా నిలుస్తున్నాయి.

పని సులభం

గతంలో ఎకర విస్తీర్ణంలో పశుగ్రాసాన్ని కుప్ప నూర్చడానికి సుమారుగా రూ. 3 వేల వరకు కూలీల ఖర్చు అయ్యేది. వరికట్టలు కట్టే యంత్రాలు రావడంతో కట్టకు రూ.30 చొప్పున ఒక్క రోజులో పది ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసాన్ని కట్టలు కడుతున్నారు. దీంతో రైతులకు సమయం ఆదా కావడంతో పాటు ఖర్చు గణనీయంగా తగ్గుతోంది. వీటితో పాటు ఒకేసారి ట్రాక్టర్‌లో సుమారు ఐదెకరాల పశుగ్రాసాన్ని తరలించవచ్చు. ఎండిన పశుగ్రాసాన్ని కేవలం ఎకరాకు ఒక ట్రాక్టర్ ట్రిప్పులో నిల్వ చేయడానికి తరలించేవారు. దీంతో ఖర్చు పెరగడంతో కొందరు రైతులు పశువులను పోషించలేక అమ్ముకున్న దాఖలాలు కో కొల్లలు ఉన్నాయి. పశుగ్రాసం నిల్వ సామర్థ్యం పెరగడంతో తిరిగి రైతులు పశుసంపదను పెంచుకునే ఆలోచన దిశగా ముందుకు సాగుతున్నారు. ముల్కనూర్ డెయిరీ కింద ఉన్న మండలాలు భీమదేవరపల్లి, ధర్మసాగర్, వేలేరు మండలాల కింద ఉన్న ఆయా గ్రామాల రైతులు, ఎల్కతుర్తి మండలంలో ఉన్న ఎస్సారెస్పీ ఆయకట్టు కింద ఉన్న దండేపల్లి, వీరనారాయణపూర్, సూరారం, బావుపేట, తిమ్మాపూర్, కేశవాపూర్ గ్రామాల్లో వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పశుగ్రాసాన్ని రైతులు కొనుగోలు చేసి మెట్ట ప్రాంతం గ్రామాలకు ట్రాక్టర్లలో తరలించి నిల్వ చేసుకొని పశుసంపదను పోషిస్తున్నారు.


పని సులభం



కోసిన పశుగ్రాసాన్ని కుప్పలేయడానికి కూలీల ఖర్చు బాగా వచ్చేది. వరిగడ్డి కట్టలు కట్టే యంత్రం రావడంతో తక్కువ సమయంలో ఎక్కువ పశుగ్రాసాన్ని నిలువ చేసుకుంటున్నాము. కట్టలు కట్టించడానికి డబ్బులు సైతం తక్కువగానే అవుతున్నాయి.

– శనిగరం రాజేందర్, రైతు

కూలీల కొరత తీరుతుంది



వరికట్టలు కట్టే యంత్రం రావడంతో కూలీల కొరత తప్పింది. తక్కువ సమయంలో ఎక్కువ కట్టలు కట్టించుకుంటున్నాము. సమయం కూడా ఆదా అవుతోంది. ప్రభుత్వం యంత్రాలకు రాయితీ ఇస్తే మరింత సౌలభ్యంగా ఉంటుంది.

– దాట్ల సుధాకర్ రైతు ఎల్కతుర్తి

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న బాలుడి మృతి



రాహుల్ (ఫైల్)

ఎల్కతుర్తి: రోడ్డు ప్రమాదానికి గురైన ఓ బాలుడు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామానికి చెందిన బానోత్ రాహుల్(16) తన ద్విచక్రవాహనంపై ఈనెల 12న హుస్నాబాద్ వైపు నుంచి ముల్కనూర్ వైపు వస్తుండగా ముల్కనూర్ నుంచి మంగళపల్లికి వస్తున్న ట్రాక్టర్ అతివేగంగా అజాగ్రత్తగా నడపడంతో మంగళపల్లి వైపు తిప్పాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై ఉన్న రాహుల్ సడన్ బ్రేక్ వేసి ముందు ఉన్న ట్రాక్టర్ ట్రాలీ వెనుకభాగాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి రాజు ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

నడికూడ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని చౌటుపర్తి క్రాస్‌రోడ్డు పరకాల–హుజురాబాద్ ప్రధాన రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చౌటుపర్తికి చెందిన తోట రాజయ్య బైక్‌పై నడికూడ నుంచి చౌటుపర్తికి వెళ్తుండగా పరకాల–హుజురాబాద్ ప్రధాన రహదారి నుంచి చౌటుపర్తికి క్రాస్ అవుతుండగా కరీంనగర్ నుంచి మేడారం వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న రాజయ్య ఎగిరి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. 108 కాల్ చేస్తే అరగంట వరకు రాకపోవడంతో స్థానికులు ఆటోలో తరలించారు. అంబులెన్స్ సమయానికి రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు

కమలాపూర్: మండల కేంద్రానికి చెందిన కొత్తకొండ రవి ఆటో డ్రైవర్‌పై ఆదివారం హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఇ.హరికృష్ణ తెలిపారు. కమలాపూర్‌కు చెందిన వెంగళ శ్రీనివాస్ శనివారం రాత్రి కూరగాయల కోసం స్థానిక కూరగాయల మార్కెట్‌కు వెళ్లి అక్కడే ఉన్న మిర్చి, బజ్జీల బండి వద్ద నిలబడ్డాడు. ఇది గమనించిన ఆటోడ్రైవర్ రవి పాత కక్షలను మనసులో పెట్టుకుని కొబ్బరిబొండాలు కొట్టే కత్తితో వెనుక నుంచి శ్రీనివాస్‌పై దాడి చేసి గాయపర్చాడు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు రవిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దామెర: మండలంలోని ఊరుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యాసంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఊరుగొండ సమపంలోని ఒక రిసార్ట్‌లో ఆదివారం కలుసుకున్నారు. 20 సంవత్సరాల తర్వాత కలుసుకున్న చిన్ననాటి మిత్రులు ఎదురుపడగానే ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై కొంక అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉన్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని, వారి సంఖ్య పెంచేందుకు పూర్వ విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు సత్యనారాయణ, గణపతి, సమ్మయ్య, రవీందర్, రాజు, గోవర్ధన్, సోమయ్య, ఇంద్రారాణి, పాల్గొన్నారు.

ఎల్కతుర్తి: మండలంలోని వంగరలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1986–87 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకొని ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.



దామెర : వేదికపై విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఎల్కతుర్తి : వేదికపై ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు